క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీతమ్మధార రైతుబజార్ వద్ద అనధికార బడ్డీకొట్లు, వాల్‌పోస్టర్లనుతొలగించారు. తేజేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా పోస్టర్లు అతికిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



విజయకుమారి

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పట్టాభిరెడ్డితోట మాణిక్యాంబ కాలనీకి చెందిన గొర్లి విజయకుమారి ఆదివారం నుంచి కనిపించలేదు. ఆమె భర్త గొర్లి కాశీకుమార్ ఆటో నడుపుతూ, రియల్ ఎస్టేట్ చేస్తుంటాడు. అతడు పనుల మీద ఆదివారం మధ్యాహ్నం గోపాలపట్నం వెళ్లి తిరిగి వచ్చి చూస్తే భార్య ఇంట్లో లేకపోవడాన్ని గమనించాడు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సత్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడ రాంజీ ఎస్టేట్‌కు చెందిన కంది కొండారాజు ఆదివారం రాత్రి హైవేలో కప్పరాడ హనుమాన్ ఆలయం వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో బిర్లా జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు బైకుపై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. గాయాలపాలైన కొండరాజును వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్.మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా పాట్ పెయిటింగ్



మెరుగులద్దిన కుండలతో విద్యార్థులు

మురళీనగర్: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చదివించారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ ఆధ్వర్యంలో కథలు చదివించి, వారి చేత చెప్పించారు. రిసోర్స్ పర్సన్‌గా వనిత వాకర్స్ క్లబ్ నుంచి జి.శిరీష పాట్ ఆర్ట్(కుండలు)తో మెరుగులు దిద్దడం, అనేక డిజైన్లను పిల్లలకు నేర్పించడం చేశారు. చిన్నారులు ఉత్సాహంగా వాటిని నేర్చుకున్నారు. అనతంరం వారికి పండ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

కైలాసపురంలో కొత్త స్తంభాల ఏర్పాటు



పోల్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం కై లాసపురంలోని పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. స్తంభాల పొడవు తక్కువగా ఉండటం వల్ల సమీప ప్రాంత ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండటంతో ఈ చర్యలు చేపట్టారు. పలు పాత పోల్స్ స్థానంలో అతి పొడవైన స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది ఈ పనులను పూర్తిచేశారు.

ట్రాఫిక్ తంటాలు.. తరచూ ప్రమాదాలు



జీఎస్ లేఅవుట్‌లో షాపుల వద్ద పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీస్



ప్రమాదానికి గురైన కారు

సీతమ్మధార: స్థానిక బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆర్చ్ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతి రోజూ ఈ రోడ్డులో ఎక్కడో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ ప్రాంతంలో టీ షాపులు, కూరగాయల దుకాణాలు, హోటల్ ఉండటంతో అక్కడి వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలిపేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఈ రహదారిలో సోమవారం ఓ కారు ప్రమాదం జరిగింది. యూటర్న్ వల్ల తరచూ ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఎన్ని సార్లు హెచ్చరించినా.. షాపుల యాజమానులు పట్టించుకోవడం లేదు. అధికారులు పరిశీలించి వాహనాలను ఇబ్బందికరంగా పార్క్‌చేసి వదిలేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



54వ వార్డులో వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న సమన్వయకర్త కె.కె.రాజు



44వ వార్డులో కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 44వ వార్డు వెంకటేశ్వర న్యూ కాలనీ 01 సచివాలయం పరిధిలోని నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం ఇన్‌చార్జి ఎం.సునీల్, 44వ వార్డు నాయకులు బానాల తరుణ్, హబీబ్, పల్లికిల గోపి, బాక్సర్ వెంకటరావు, మహదాస్యం గోపి, పిడుగు వెంకటరమణ, ముత్యాలు, కె.ప్రకాష్, దుర్గాప్రసాద్, ఆదినారాయణ, ఇజ్జు సీతారామ్, కాయల రామారావు, సీనియర్ నాయకులు సేనాపతి అప్పారావు, పైడి రమణ, షేక్ బాబ్జి, హరి పట్నాయక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమమని కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు దేవేంద్రనగర్, రవీంద్రనగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, నివాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్ చల్లా రజని, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి యు.సునీల్, డైరెక్టర్ రాయుడు, వార్డు నాయకులు ఈశ్వరరావు, చిరంజీవి, రమణమ్మ, రత్నాకర్, శ్రీను, సోమేష్, రాంబాబు, నమ్మి శంకర్, ప్రసాద్, నాగరాజు, దిలీప్, రాధాకృష్ణ, దివాకర్, సారిపిల్లి జగదీష్, అచ్యుతరావు, జామి దాస్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులకు అవార్డులు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా సోమవారం సమ్మర్ స్పీడ్ అండ్ రోల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. మురళీనగర్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడలను అభ్యసించారు. ఉత్తమ క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్, క్రైం సీఐ దుర్గాప్రసాద్, ఎయిర్‌పోర్టు సీఐ బి.ఎం.డి.ప్రసాద్, కంచరపాలెం ఎస్‌ఐ దివ్యభారతి, స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఎస్‌డీవో సూర్యారావు చిన్నారులకు అవార్డులు అందించారు. పార్కు ఉపాధ్యక్షుడు ఎం.శాంతి భూషణ రావు, కార్యదర్శి పొట్లూరి నాగరాజు, ట్రెజరర్ కె.కె.సురేష్, కోచ్ సంతోష్, లలితప్రియ, 200లకు పైగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే మెరుగైన పారిశుధ్యం



ముస్లిం తాటిచెట్లపాలెంలో నివాసులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవోహెచ్ రాజేష్

సీతంపేట: ప్రజల సహకారంతోనే మెరుగైన పారిశుధ్యం సాధ్యమని జీవీఎంసీ జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ అన్నారు. 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో సోమవారం స్థానికులకు చెత్త విభజన, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. బజారు, కిరాణా, టిఫిన్ కొట్లు, మాంసం దుకాణాలకు వెళ్లేటపుడు స్టీల్ బాక్సు లేదా గుడ్డ సంచి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలని, తద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలను వ్యాప్తి చేసే దోమలను నియంత్రించవచ్చని చెప్పారు. నీరు నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములపై మూతలు గాని గుడ్డ గాని చుట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పారిశుధ్య పనులకు సంబంధించి స్థానికులతో ఏఎంహెచ్‌వో రాజేష్ నేరుగా మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శానిటేషన్ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది, సూపర్ వైజర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష



కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రజలకు వివరించాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 2024లో మళ్లీ ఆయనే సీఎం అని జోష్యం చెప్పారు. వార్డుల్లోని అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి పనులు వేగవంతం చేయించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, చల్లా రజని, శశికళ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, రత్నాకర్, డైరెక్టర్లు పైడి శ్రీను, ఐ.రవికుమార్, కిరణ్‌రాజు వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కొన్ని అర్జీలను కె.కె.రాజు తక్షణం పరిశీలించారు. మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పలువురు వార్డుల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా సాహితీ సమ్మేళనం



డాక్టర్ గోపాల్‌నాయిడును సన్మానిస్తున్న సభ్యులు

మురళీనగర్: మాధవధార భరద్వాజ క్షేత్రంలో సోమవారం అమరావతి-విశ్వసాహితి సంస్థ సాహితీ సమ్మేళనం ఘనంగా జరిగింది. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ పి.గోపాల్‌నాయుడు ఆధునిక కవిత్వంపై ప్రసంగించారు. సభాధ్యక్షుడు డాక్టర్ కె.బాబూరావు తొలిపలుకులతో ప్రారంభమైన సమావేశంలో డాక్టర్ పి.గోపాల్‌నాయుడును సన్మానించారు.పి.ఎల్.వి.ప్రసాద్, సిహెచ్.చిన సూర్యనారాయణలు కవి సమ్మేళనం నిర్వహించారు. కథల కవితలతో అలరించారు. కార్యక్రమంలో ఆర్.రాములు, డి.ఎస్.కుమార్, రాంతాత, శ్రీకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లం అప్పారావు మృతికి సంతాపం

తాటిచెట్లపాలెం: ఇటీవల అమెరికాలో మరణించిన ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ అల్లం అప్పారావు మృతికి విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సంతాపం తెలిపారు. తాటిచెట్లపాలెంలోని సంఘ కార్యాలయంలో సోమవారం రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ అల్లం అప్పారావు జేఎన్‌టీయూ, కాకినాడకు వీసీగా, హైదరాబాద్‌లోని సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా, ఏయూ కంప్యూటర్ సెంటర్ డైరెక్టర్‌గా, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఆయన మరణంతో తెలుగు రాష్ట్రాలు ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయినట్లు అయిందన్నారు. పోతల కన్నప్పడు, ఎనుపోతుల శంకరరావు, సూరాబత్తుల తిరుపతిరావు, జక్కంపూడి సత్తిబాబు, కాయల శ్రీనివాసరావు, చోడిశెట్టి జనార్దనరావు, సంకుబత్తుల నర్సయ్య, మానం లక్ష్మణరావు, గుడివాడ వెంకటరావు, పలిశెట్టి అప్పన్న పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మర్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్-4 కార్యాలయంలో ఈ నెల 23న ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ వాహనాలను మంగళవారం సాయంత్రం 4 గంటలకు సెబ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు సమక్షంలో వేలం వేస్తామన్నారు. వివరాలకు 94409 02382 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చిరు వ్యాపారుల నిరసన

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం వద్ద తోపుడు బండ్ల చిల్లర వ్యాపారులు, ఏఐటీయూసీ, హాకర్స్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. హాకర్స్ సంఘ గౌరవ అధ్యక్షుడు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ జోన్ పరిధిలో వ్యాపారాలకు సరైన హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. తోపుడు బళ్లు, చిరు వ్యాపారుల దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారని, జరిమానాలు విధిస్తున్నారని, వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు, వ్యాపారులు కోరారు.

బాలబాలికలకు చదరంగంలో శిక్షణ



చిన్నారులకు చెస్‌లో ప్రాథమిక విషయాలు తెలియజేస్తున్న శిక్షకుడు

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్క్‌లో సోమవారం చదరంగం శిక్షణ శిబిరం సందడిగా ప్రారంభమైంది. బాలబాలికలు, వారి తల్లితండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్క్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ చదరంగం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. వాకర్స్ పార్క్‌లో ప్రతీ ఏడాది ఈ శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. చదరంగం శిక్షకుడు సనపల ఉమాపతి శిక్షణకు హాజరైన వారిని మూడు కేటగిరీలుగా విభజించి, ప్రాథమిక విషయాల నుంచి ఆటలో అన్ని మెలకువలు నేర్పించారు. ఒక మొబైల్ గ్రూప్ తయారుచేసి వారికి పజిల్స్ ఎలా చేయాలో వివరించి హోం వర్క్ ఇచ్చారు. ఈ నెల 31 వరకు శిబరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో లంకా సుధాకర్, ఎన్.ప్రకాశరావు, ఎస్.సీతారామకృష్ణ, ఆదిభట్ల రామకృష్ణ, వడ్డాది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలపై కొరడా



కప్పరాడలో కారు తొలగింపును పరిశీలిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: ఎక్కడపడితే అక్కడ రాంగ్ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహనాలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. హైవేపై తాటిచెట్లపాలెం నుంచి బిర్లా జంక్షన్ వరకు సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న వాహనాలను టోయింగ్ వాహనం ద్వారా సోమవారం తొలగించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ పర్యవేక్షించారు. సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు రాంగ్ పార్కింగ్ వాహనాలను తొలగించి వాటిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించామన్నారు. జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్డులో తాటిచెట్లపాలెం, ధర్మానగర్, బిర్లా జంక్షన్ వరకు డేంజరస్ పార్కింగ్ చేసి పాదచారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహనాలను తొలగించామని తెలిపారు. కంచరపాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలకు జగన్ సర్కార్ కృషి



మాణిక్యాంబ రజక కాలనీలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ శంకరరావు

మర్రిపాలెం: ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 49వ వార్డు మాణిక్యాంబ రజక కాలనీలో డ్రైనేజీ సెప్టిక్ ట్యాంక్ పైపులు, డ్రైనేజీ కాలువల మరమ్మతులు, డ్రైనేజీ గెడ్డ బ్రిడ్జి నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు సోమవారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.25 లక్షలతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అనేక సచివాలయాల పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టామని, ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అల్లు శంకరరావు మాట్లాడుతూ కె.కె.రాజు చొరవతో మాణిక్యాంబ రజక కాలనీలో మౌలిక వసతుల కోసం రూ.25 లక్షలు మంజూరయ్యాయని, వాటితో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్, కె.కె.రాజులకు వార్డు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ గణేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్యాసప్పుడు, రామరాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.సునీల్, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, చంద్రమౌళి, శంకర్, మున్నా, అప్పారావు, జయరాం, అప్పలనాయుడు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న డాక్టర్ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి నాగశ్రీను

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఫైలేరియా బాధితులకు 'మార్బిడిటీ మేనేజ్‌మెంట్'పై అవగాహన కల్పించారు. వ్యాధి తీవ్రత ఎక్కువ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫైలేరియా కారణంగా కాలు బాగా వాచిపోతాయని, వాపును బట్టి గ్రేడ్ 1, 2, 3, 4 నాలుగు స్థాయిలుగా ఉంటుందన్నారు. బాగా వాచిన కాళ్లను ప్రతి రోజూ సబ్బుతో శుభ్రం చేసుకుని తుడవటం ద్వారా వాపు పెరగకుండా తదుపరి గ్రేడ్‌కు వెళ్లకుండా ఉంటుందన్నారు. కాళ్ల వాపు తగ్గడానికి, నడవటానికి సులువుగా ఉండేలా ప్రతి రోజూ చేయాల్సిన ఎక్సర్‌సైజులను వివరించారు. అనంతరం ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు యూపీహెచ్‌సీ వైద్యురాలు ప్రశాంతి, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగశ్రీను చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.8.50 లక్షలతో అభివృద్ధి పనులు



మధురానగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ చాకలి గెడ్డ వద్ద రూ.8.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. సోమవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి సచివాలయం పరిధిలో మౌలిక వసతులు కల్పించామన్నారు. పాడైన రహదారులు, డ్రెయిన్లు తిరిగి నిర్మించామని చెప్పారు. ప్రధాన రహదారులతోపాటు అనుబంధ రోడ్లు నిర్మించారని, స్వల్పంగా దెబ్బతిన్న రహదారులను ప్యాచ్ వర్క్‌లతో పునరుద్ధరించామన్నారు. స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రావాడ వీరమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ కార్యదర్శులు జ్యోతి, కృష్ణ, అనూష, స్థానిక మహిళలు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

'స్పందన'కు 12 అర్జీలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-5కు ఐదు..

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, టీపీఆర్‌వో ఏపీడీ యూసీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

వేడి తారులో జారిపడి డ్రైవర్ మృతి

మృతుడిది విశాఖపట్నం

రాయగడ: వేడి తారులో ప్రమాదావశాతు కాలు జారి పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. మృతుడు విశాఖపట్నానికి చెందిన ఎ.కృష్ణారావు(42)గా గుర్తించారు. జిల్లాలోని బిసంకటక్ సమితి దుర్గి పంచాయతీ పరిధి బొంధుగుడ గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొంధుగుడ గ్రామంలో రహదారి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి వచ్చిన లారీలోని తారును హాట్‌మిక్సర్ ప్లాంట్‌లో వేసేందుకు డ్రైవర్ కృష్ణారావు వాహనం పైకి ఎక్కాడు. వాల్‌ను తిప్పుతున్న సమయంలో కాలు జారడంతో హాట్ మిక్సర్ ప్లాంట్(తారును వేడి చేసే యంత్రం)లో ప్రమాదావశాతు పడిపోయాడు. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు రక్షించేందుకు ప్రయత్నించినా.. ప్రయోజనం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించగా, బిసంకటక్‌కు చెందిన సిబ్బంది దాదాపు 2గంటలు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

అశాస్త్రీయ విద్యా విధానాలను విడనాడాలి

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అశాస్త్రీయ, మనువాద విధానాలను విడనాడాలని డీటీఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.ధర్మేంద్రరెడ్డి అన్నారు. సోమవారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బాధిత మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారుల నియంతృత్వ పోకడల్ని వ్యతిరేకించాలన్నారు. పాఠ్యాంశాల సిలబస్ తగ్గింపు పేరుతో చరిత్ర వక్రీకరణకు పాల్పడుతున్నారని, ప్రఖ్యాత డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీటీఎఫ్ బాధ్యులు సంధ్యారాణి, సాయిప్రసాద్ మాట్లాడారు.